# బాలమిత్ర

- వాసంతి మాఘుప.

## ఏది మేలు?

గడపలన్నిటిలోన ఏ గడప మేలు?
మహాలక్ష్మి నర్తించు మా గడప మేలు
అరుగులన్నిటిలోన ఏ అరుగు మేలు?
అథితులందరు జేరు మా అరుగు మేలు
వీధులన్నిటిలోన ఏ వీధి మేలు?
కొట్లాటలేలేని మా వీధి మేలు
ఊరులన్నిటిలోన ఏ ఊరు మేలు?
సిరులు సంపదలు తులతూగు మా ఊరు మేలు
గురువులందరిలోన ఏ గురువు మేలు?
వేదసారము తెలుపు మా గురువు మేలు.

## తెలుసుకుందాం!

బలమెవ్వడు కరి బ్రోవను
బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్
బలమిల సుగ్రీవునకు
బలమెవ్వడు నాకు నీవె బలమౌ కృష్ణా!
(శ్రీకృష్ణ శతకము నుండి)

కరి = ఏనుగు (గజేంద్రుడు)
ఇల = భూమిని

కృష్ణా! గజేంద్రమోక్షములో గజేంద్రుని రక్షించినది, పాండురాజు తనయుల (పాండవుల) భార్య అయిన ద్రౌపదిని గాచినది, సుగ్రీవునికి అభయమిచ్చి, అండగానిలిచినది నీవేకదా! ఈ విధముగా గజేంద్రునకు, ద్రౌపదికి, సుగ్రీవునకు బలమైతివి. నాకు గూడ నీవు తప్ప నెవరు బలము?

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 6 అక్షరములు కలిగిన ఒక పర్యాటక స్థలం పేరు.
2. 3, 4 అక్షరములు ఒక చక్రవర్తిని తెలియజేస్తాయి.
3. ఆరవ అక్షరం ఓ రకమైన మద్యం.
4. 2, 6 అక్షరములు ఒక అలంకార వస్తువును తెలియజేస్తాయి..
5. చివర సున్న లేకపోతే 5, 4, 2, 6 అక్షరములు ఓ వంటకాన్ని తెలియజేస్తాయి.

ఏమిటా పదం?

**సమాధానం చెప్పగలరా? ప్రయత్నించండి!**

1. పళ్ళున్నా కొరుకలేనిది ఏమిటి?
2. తల ఉన్నా ఆలోచించలేనిది ఏమిటి?
3. చేతులు ఉన్నా తినలేనిది. ఏమిటి?
4. పని ముట్టుకుంటే అరిగేది.
   పని ముట్టకుంటే అలిగేది.
   పనిచేస్తుంటే నాట్యం.
   పని చేయకుంటే మూలచేరటం.
   ఏమిటిది?
5. వాయువే నాకు ప్రాణం.
   అది అందితే ఉబ్బుతాను.
   అందకుంటే తగ్గుతాను. నేనెవరిని?

(సమాధానములు వచ్చే సంచికలో)

## తొందరపాటు - పర్యవసానము

ఒక అగ్రహారములో రాఘవ అనే బ్రాహ్మణుడు, భార్య వేగవతి, కొడుకు నివసించెడివారు. అతడు ఒక ముంగిసను పెంచసాగాడు. దానిని తన కొడుకుతో సమానముగా ఆదరించాడు. వేగవతి మాత్రము ఆ ముంగిస వలన తన కుమారునికి అపాయము కలుగునేమోనని భయపడుతుండేది.

ఒకనాడు రాఘవ అత్యవసరమైన పని నిమిత్తము ప్రక్క గ్రామమునకు, వేగవతి మంచి నీటికై చెరువునకు పోయిరి. కుమారుడు ఉయ్యాలలో నిదురపోవుచుండెను. ఆ సమయములో అచ్చటికి ఒక నాగుపాము వచ్చుచుండగా చూచిన ముంగిస దానితో పోరాడి, ఆ పామును ముక్కలుగా చేసి, ఆ బాలుని రక్షించెను.

కొద్ది సేపటికి నీళ్ళ బిందెతో వస్తున్న వేగవతిని చూచి ముంగిస, ఆనందముతో రక్తపు మరకలతోనే ఆమెకు ఎదురు వెళ్ళగా, ముంగిస తన కుమారుని చంపినదని తలపోసి వేగవతి తన చేతిలోనున్న నీళ్ళ బిందెను ఆ ముంగిసపై పడవేయగా, ముంగిస అక్కడికక్కడే ప్రాణములు విడిచెను. తరువాత ఇంటిలోనికి పోయి చూడగా ఉయ్యాలక్రింద పాము చచ్చిపడియుండుట గమనించి మిక్కిలి దు:ఖించెను. ఇంతలో రాఘవ వచ్చి జరిగినది తెలుసుకొని "ఇప్పుడు ఏడ్చి ప్రయోజనమేమి? ఆలోచించక, నిజమునెరుగక తొందరపాటుతో చేసిన పని అనర్థాలకు దారి తీస్తుంద"ని సుద్దులు చెప్పెను.

**నీతి** : ఆవేశముతో చేసే పని అనర్థాలకు మూలము.

## త్రిగుణములు

త్రి అనగా మూడు. సత్వగుణము, రజోగుణము, తమోగుణము అనే మూడు గుణములను త్రిగుణములు అంటారు. ప్రతివారిలోనూ ఈ గుణములు ఉంటాయి. అయితే సత్వగుణము ఎక్కువగా ఉన్నప్పుడు వారికి తోటివారితో సఖ్యతతో మెలగడము, శాంత స్వభావము, అవసరమైనవారికి సహాయము అందించడము, మృదువుగా సంభాషించడము, సమాజ శ్రేయస్సుకై, లోక కళ్యాణమునకై కృషి చెయ్యడము వంటివి అలవడతాయి. ఈ సందర్భములో గెలుపు పొందినపుడు అతి ఉత్సాహము, ఓటమి పొందినపుడు విచారములకు లోనుకారు. అదే రజోగుణ సంపన్నులకు ధైర్యముతో పరిస్థితిని ఎదుర్కొనుట, పరువు ప్రతిష్టలకొఱకు ప్రాకులాడుట, పరుల మెప్పును ఆశించుట వంటివి అలవడతాయి. వీరు ఓటిమిని అంగీకరించలేరు. కోరినది పొందడానికి వీరు ఎంత శ్రమనైనా లెక్కచెయ్యరు. తమోగుణమును ఎక్కువగా కలిగిన వారు పని చెయ్యడానికి బద్ధకము, ఎక్కువ సమయము నిద్రలో గడపడము, అమితాహారము, అయినదానికి కానిదానికి కలహమును రేపుట, కోపము, చిరాకు, వ్యసనములకు బానిసకావడము వంటివి ప్రదర్శిస్తారు.